క్లుప్తంగా

మాజీ సైనికులకు ఘన సత్కారం


ఆర్మీ సైనికులను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికులను క్లబ్‌కు ఆహ్వానించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌లో వారు నేర్చుకున్న క్రమశిక్షణ, నిజాయతీ, దేశభక్తి, వారి అనుభవాలను చక్కగా వివరించారు. దేశం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన సైనికులను సత్కరించుకోవడం మన బాధ్యత అని ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ గవర్నర్ శుభ, కార్యదర్శి ఎం.జయ, సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వం

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలను కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి లోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1069వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చే శారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని హితవు పలికారు.

అల్పాహారం అందజేత


అల్పాహారం అందజేస్తున్న పైల దివాకర్ ఫౌండేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: పైల శివతేజ వర్ధంతి సందర్భంగా పైల శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే న్యూకాలనీ షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం వద్ద అన్నార్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైల దివాకర్ మాట్లాడుతూ తన ఏకైక కుమారుడు పైల శివతేజ ప్రమాదవశాత్తు మరణించి పదేళ్లు పూర్తయిందని, తన జ్ఞాపకార్థం ప్రతి ఏటా జయంతి, వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం, చేస్తూ, పలువురు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సత్య, మహారాణా, చిరంజీవి పాల్గొన్నారు.

ఇంటింటా అయోధ్య అక్షింతల పంపిణీ

తగరపువలస: అయోధ్య శ్రీరామ మందిరంలో ఈ నెల 22న బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమిలి మండలం చిప్పాడలో శ్రీసుత్తమ్మతల్లి భవానీ పీఠం, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పంచాయతీలోని చిప్పాడ, సిటీనగర్, ఆశిపాలెం, కొసనవానిపాలెం, నమ్మివానిపాలెం, కంచేరుపాలెం తదితర గ్రామాల్లోని 1300 ఇళ్లకు ఈ అక్షింతలు చేరవేశారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

- రంగవల్లికలతో ఇళ్లకు నూతన శోభ
- మహిళలకు ముగ్గుల పోటీలు


ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు


సంక్రాంతి ముగ్గు వేస్తున్న బాలికలు


మల్కాపురం వద్ద భజన చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు


90వ వార్డు కాకానీనగర్‌లో భోగి పండగ సందడి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల పరిధుల్లో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ పండగలు కనుల పండువగా జరిగాయి. దీనిలో భాగంగా మల్కాపురం, శ్రీహరిపురం, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి, వాటిపై గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. మల్కాపురం గొల్లవీధిలో ముగ్గుల పోటీ నిర్వహించారు. పలువురు బాలికలు రంగు రంగుల ముగ్గులు వేశారు. వీరిలో ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. సంక్రాంతి సందర్భంగా మల్కాపురం పల్లివీధి వద్ద విజయ బాలమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం భజన చెట్టును పుర వీధులలో ఊరేగించారు. విజయ బాల మిత్ర కళా సమితి యువత శ్రీరాముని కీర్తనలు ఆలపిస్తు కోలాటం ప్రదర్శించారు.

రామాలయంలో పూజలు..

కనుమ సందర్భంగా మల్కాపురంలోని నగరాల వీధిలో గల కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం సీతా రామ లక్ష్మణ సమేత హనుమంతులకు స్థానిక మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సీతారాములను పంచామృతాలతో అభిషేకించారు. మహిళలు కోలాట ప్రదర్శనతో పాటు, లలితా పారాయణ, విష్ణు సహస్ర నామాలు పఠించారు. మధ్యాహ్నం స్వామి ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు..

సింధియా: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడారి ఆనంద్‌కుమార్ మహిళలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించారని తెలిపారు. ఒక్క మహిళలనే కాకుండా అన్ని వర్గాల ప్రజలను ఆయన ప్రోత్సహిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు


రామాలయంలో కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

అంబరాన్నంటిన సంబరాలు..

విశాఖ విద్య: జీవీఎంసీ 52,90 వార్డుల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రతి ఇంటా పండగ సందడి కనిపించింది. తెలుగువారి పెద్ద పండగ కావటంతో వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా సొంతూళ్లకు వచ్చి, కుటుంబ సభ్యులతో పండగ చేసుకున్నారు. కొత్తబట్టలు ధరించి, ఇళ్ల వద్దే భోగిమంటలు వేసుకుని, సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు కుటుంబం అంతా కలసి పండగ జరుపుకోవటంతో అంతా ఆనందంగా గడిపారు.

పట్నం.. పల్లెబాట

- రహదారులు ఖాళీ
- అంతా నిర్మానుష్యం


ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి కరాసా వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారి


తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారి

గోపాలపట్నం: పట్టణం పల్లెకు వెళ్లింది. రహదారులపై జనం లేక వెలవెలబోతున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా నగరవాసులు స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. చాలా వరకు ఫుట్‌పాత్ దుకాణాలు మూతపడ్డాయి. సంక్రాంతి నాడు గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాలు జనం లేక వెలవెలబోయాయి. భోగి రోజే చాలా మంది సొంత గ్రామాలకు పయనమయ్యారు. మరి కొత మంది సంక్రాంతి రోజు పూజలు చేసి బయలుదేరారు. దీనికి తోడు సెలవు రోజులు కావడంతో దుకాణాలు లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు కూడా నిర్మానుష్యంగా మారిపోయాయి.

ఉత్సాహంగా కనుమ పండగ

మాంసం దుకాణాల వద్ద జనం బారులు

గోపాలపట్నం: మూడు రోజుల పండగ ఒక ఎత్తు.. కనుమ పండగ ఒక ఎత్తు. అందులోనూ కనుమ మంగళవారం పడడంతో జనం మాంసం దుకాణాల వద్ద బారులు తీరారు. ఉదయం 5.30 గంటల నుంచి చికెన్, మటన్ షాపుల ముందు క్యూ కట్టారు. త్వరగా మార్కెట్ పని ముగించుకుని మిగిలిన పనులు చూసుకోవచ్చనే ఆత్రుత జనంలో కనిపించింది. గోపాలపట్నం జంక్షన్‌లోని మాంసం దుకాణాల వద్ద జనం భారీ క్యూలైన్లలో వేచి మరీ చికెన్, మటన్ కొనుగోలు చేశారు. కొన్నిచోట్ల ఈ రద్దీ మధ్యాహ్నం వరకు కొనసాగింది. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కిలో మటన్ రూ.1000కు చేరుకుంది. అయినప్పటికీ పెద్ద ఎత్తున మాంసం అమ్మకాలు జరిగాయి.


ఉదయం 6 గంటలకే గోపాలపట్నం బంక్ వద్ద క్యూలైన్‌లో జనం

విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో కూర్మాన శివరామకృష్ణ, పెంట్ల శివ, కోన శ్రీను జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో విండ్‌బాల్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. సంక్రాంతి సందర్భంగా గత ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మూడు రోజుల పోటీలను ఆ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల్లో ముందుకు వెళ్తూ రాణించాలని, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ఫైనల్స్‌లో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్–1 యువజన విభాగం అధ్యక్షుడు గంటా వర్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెంట్ల బాలకృష్ణ, రాకింగ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్ట దళ పద్మారాధన నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తు లు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

సామాన్యుల సేవలో మాస్టర్ ఈకే సంస్కృతి సదన్

మహారాణిపేట : సామాన్యులకు తన వంతు సేవలందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురుపీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు. పీఠం గత ముప్పై సంవత్సరాల నుంచి చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్ (ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించారు. అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే, పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని ఆయన అన్నారు. 1994లో స్వర్గీయ డాక్టర్ టి.వి.వి.ఎస్.రావు నేతృత్వంలో ఇక్కడ మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు.

1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు తెలిపారు. సంస్కృతీ భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, దాతలు, కార్యకర్తలకు సత్యదేవ్ కృతజ్ఞతలు తెలిపారు జగద్గురుపీఠం సలహా మండలి సభ్యులు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవ, ఆధ్యాత్మిక సాధన, త్యాగనిరతి అనేవి తరించడానికి దోహదపడతాయన్నారు. యజ్ఞార్థ జీవనాన్ని మాస్టర్ ఈకే అలవరిచారన్నారు. బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు.

సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని ఆయన చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి. వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యులు జి.వి.ఎన్. హరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, సత్యదేవ్, బీఆర్‌కే రాజు

భక్తిశ్రద్ధలతో గో పూజ


గోవులకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు


గోపూజలో భాగంగా సంప్రదాయ వేషధారణలో గ్రామస్తులు

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు. శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకృష్ణాష్టకం పఠించి విశేషంగా హారతులు అందజేశా రు. దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చినయాతపాలెంలో..

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెం గ్రామంలో కనుమ పర్వదినాన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం గోపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, సభ్యులు మళ్ల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధిగా బుద్ధ నరసింహారావు పాల్గొని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య చినయాతపాలెంలో గోమాతకు గ్రామస్తులంతా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో శ్రీరామ నామస్మరణతో అయోధ్య రాముడిని గుర్తు చేస్తూ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తుంపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావు, మళ్ల రాము, మళ్ల గంగు నాయుడు, మళ్ల నాగభూషణం, మళ్ల సత్యనారాయణ, బొడ్డేటి కాశీ సూరి అప్పారావు, హరిదాసు వేష ధారణలో అలరించారు. దొడ్డి మహేశ్వరరావు, గంగి రెద్దులు ఆడించే వేషధారి శరగడం రామ కోటి తదితరులు తమ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

పరసల కోలాహలం


పరసలో ఏర్పాటు చేసిన అంగడి వద్ద పిల్లలు, పెద్దలు

- సంక్రాంతి వేళ.. ఆనవాయితీగా నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు

కంచరపాలెం: పరసల కోలాహలం మొదలైంది. సంక్రాంతి సీజన్‌లో పరసలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో తీర్థాలుగా వ్యవహరించే వీటిని శ్రీరామలీలా పరసల పేరిట ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ పరసలు కనిపిస్తుంటాయి. సంకాంత్రి రోజున కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో, జాషువా కళా ప్రాంగణంలో, కనుమ రోజున గవర కంచరపాలెం, ముక్కనుమ రోజున రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల్లో పరసలు నిర్వహిస్తారు. మర్రిపాలెం, కరాసా, తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, అల్లిపురం తదితర ప్రాంతాల్లో పరసలు జరుగుతున్నాయి.

సందడే సందడి

పరసల్లో ఏర్పాటు చేసే దుకాణాల వద్ద పిల్లలు, పెద్దలు సందడి చేస్తుంటారు. ఆటబొమ్మలు, ఖర్జూరం, పంచదారచిలువలు, పానీపూరీ, హల్వా, హాట్‌చాట్, ఐస్‌క్రీం వంటి తినుబండారాలు, గృహోపకరణాలు, వివిధ రకాల సామగ్రి మొదలైనవి విక్రయిస్తారు. పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. వీటిని నమ్ముకునే కళాకారులకు పరసలు కొంత వరకూ ఉపాధినిస్తాయి.

నేడు ఆర్పీ పేటలో..

సంక్రాంతి సంబరాలు పూర్తవక ముందే కంచరపాలెం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం ప్రాంతాల్లో పరసల సందడి మొదలైంది. శివరాత్రి వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో వీటి కోలాహలం కనిపిస్తుంది. సాముగారెడీ, తప్పెటిగుళ్లు, కోలాటం వంటి జానపద కళా ప్రదర్శనలు జరుగుతాయి. సోమవారం జాషువానగర్ ప్రసన్న వినాయక ఆలయంలో, మంగళవారం గవర కంచరపాలెం అభయాంజనేయ ఆలయంలో, బుధవారం రామ్మూర్తిపంతులు పేటలో, గురువారం కొత్తరెడ్డి కంచరపాలెంలో, ఆదివారం 104 ఏరియా, మర్రిపాలెం ప్రాంతాల్లో వేర్వేరుగా పరసలు నిర్వహిస్తారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వినాయకుడు

ఘనంగా ప్రసన్న వినాయక తీర్థ మహోత్సవం

కంచరపాలెం జాషువానగర్‌లో గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మిడి అచ్చిబాబు పర్యవేక్షణలో సోమవారం ప్రసన్న వినాయక తీర్థ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముఖ్య అతిథులు మాజీ కార్పొరేటర్లు కొప్పుల వెంకటరావు, బొట్టా ఈశ్వరమ్మ, టీడీపీ మహిళా నాయకురాలు ఈతలపాక సుజాత, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎం.కొండబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాయిత పైడి రత్నాకర్, జామి కరుణ భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పరస వేడుకలు ప్రారంభించారు. గొల్ల కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతీయులు ప్రదర్శించిన సాము గరిడీలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ వినాయక ఆలయంలో అర్చకుడు వరహగిరి జగదీష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏడు గ్రామాల సఖ్యతను చాటి చెప్పే భజన చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంఘ గౌరవ అధ్యక్షుడు గొటువాడ నరసింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి (ఆదిబాబు) తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు


ఆభరణాలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు


అలంకరణలో అయ్యప్ప స్వామి

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు పీలా రమణ అయ్యప్ప స్వామి ఆభరణాలను తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగించారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేడుకగా మకరజ్యోతి పూజలు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో మకరజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. కేరళలో గల శబరిమల అయ్యప్ప స్వామి దేవస్థానంలో జ్యోతి దర్శనం సందర్భంగా ప్రతి ఏడాది పూజలు నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా అయ్యప్పస్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు భార్గవశర్మ చేపట్టారు. అయ్యప్పస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, గురుస్వామి నీలాపు వెంకట రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి

ఆదర్శమూర్తి పౌరాణిక నటుడు అప్పలసూరి

మద్దిలపాలెం: ఉత్తమ పద్యనాటక నటుడు, ఆయుర్వేద వైద్యుడు పొన్నాన అప్పలసూరి నేటితరం నటులకు ఆదర్శమని చైతన్య సమితి అధ్యక్షుడు బీవీ అప్పారావు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస దరి ఎరగాం గ్రామానికి చెందిన డాక్టర్ పొన్నాన అప్పలసూరి 90వ జన్మదిన వేడుకలు ఇసుకతోటలోని ఆయన ఇంట్లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక నటుల్లో తొలితరానికి చెందిన పి.సూరిబాబు గాత్రాన్ని పోలిన గాత్రంతో అసాధరణ జ్ఞాపకశక్తి, క్రమశిక్షణతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. పొన్నాన అప్పలసూరి కుటుంబ సభ్యుల మధ్య నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఏయూ నాన్‌టీచింగ్ స్టాఫ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పొన్నాన అప్పలసూరికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న బీవీ అప్పారావు, మళ్ల శ్రీనివాసరావు